యథేచ్ఛగా మట్టి తవ్వకాల దందా



పర్రచివర శివారు పెదగౌడపాలెం పరిధిల ఏడబ్ల్యూడీ భూముల్లో అక్రమ తవ్వకాలు



పర్రచివర- గణపేశ్వరం మార్గంలో మట్టి తరలిస్తున్న టిప్పర్లు

- ఆత్మహత్యకు పాల్పడతానంటూ మైనింగ్ అనుమతి దారుడి ఆవేదన
- నాగాయలంక మండలంలో మట్టి వ్యాపారుల హల్‌చల్

నాగాయలంక: తీర ప్రాంతాల్లో మట్టి, బుసకను తవ్వి గత వారం రోజులుగా తరలిస్తున్నారు. పగలు రాత్రి విచ్చలవిడిగా నాగాయలంక, అవనిగడ్డ, పులిగడ్డ ప్రాంతాలకు తరలిస్తుంటే అధికార యంత్రాంగం ఏ మాత్రం స్పందించకపోవడం విశేషం. పాలక పక్షాల నేతల అండతో మైనింగ్ అనుమతులు లేకుండా ప్రభుత్వ మట్టి, బుసక దిబ్బలు తవ్వేస్తుంటే యంత్రాంగం చేష్టలుడిగి చూడటంతో ప్రజలు విస్తుపోతున్నారు.

ఈ ప్రాంతాల్లోనే..

మండలంలోని పెదగౌడపాలెం ఏడబ్ల్యూడీ భూములు, గణపేశ్వరం, దిండి, కమ్మనమోలు, టి.కొత్తపాలెం గ్రామాల పరిధిలో ఈ అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. గత మూడు రోజులుగా మట్టి దందా పరిస్థితి చూస్తుంటే కనీసం వీఆర్వోలు సైతం అడ్డుకునే స్థితి లేదంటున్నారు.

ఆత్మహత్యే శరణ్యం..

మండలంలో మట్టి తవ్వకాలకు తన భార్య పేరుతో మైనింగ్ అనుమతులు తెచ్చిన ఓ వ్యక్తి తాను సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యకు పాల్పడతానని మీడియా ఎదుట బహిరంగంగానే హెచ్చరిస్తున్నాడు. అధికారులే ఇందుకు కారణమని ఎలాంటి అనుమతులు లేకుండా మండలంలోని కమ్మనమోలు, కొత్తపాలెం లాంటి పలు గ్రామాల పరిధిలో విచ్చలవిడి తవ్వకాలు చేస్తున్నవారిని వదిలేసి, మైనింగ్ అనుమతులు పొందిన తననే అధికారులు వేధిస్తున్నారని, అందుకే ఆత్మహత్యకు పాల్పడబోతున్నట్లు హెచ్చరిక చేస్తున్నాడు. మట్టి వ్యాపారం తీవ్ర రగడకు దారి తీసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వాహనాల రద్దీకి గ్రామాల్లో ప్రజల నుంచి వ్యతిరేకత కనిపిస్తోంది.

ఒకరికి మాత్రమే అనుమతి..

మండలంలో ఒకరు మైనింగ్ అనుమతులు తెచ్చిన విషయం వాస్తవమే. మిగతా వారికి ఎలాంటి మైనింగ్ లేదా రెవెన్యూ అనుమతులు లేవు. గత వారం రోజులుగా అయితే మండలంలో ఇలాంటి పరిస్థితి కొనసాగుతున్నట్లు తన దృష్టికి రాలేదు. సంబంధిత అంశాలపై వీఆర్వోల నుంచి నివేదికలు కోరతాను.

– ముప్పిరిశెట్టి హరనాథ్, తహసీల్దార్, నాగాయలంక

క్లుప్తంగా

అధ్వానంగా ప్రధాన రహదారి



కృత్తివెన్ను: కృత్తివెన్నులోని ప్రధాన రహదారి గోతులమయంగా మారింది. ద్విచక్రవాహనాలు సైతం నడిచేందుకు ఇబ్బందిగా ఉంది. ఏ మాత్రం చిన్నపాటి చినుకు పడినా గోతుల్లో నీళ్లు నిలిచిపోయి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. బ్యాంకుకు, శివాలయానికి చేరేందుకు ఈ రోడ్డు ప్రధాన మార్గం. మండల కేంద్రంలోని రోడ్లు పరిస్థితి ఇంత అధ్వానంగా ఉంటే యంత్రాంగం పట్టించుకోక పోవడంపై ప్రజల్లో తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది. దీనిపై అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా లక్ష్మీ నరసింహ స్వామి జయంతి ఉత్సవాలు



చిలకలపూడి(మచిలీపట్నం): మండల పరిధిలోని కరగ్రహారం లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో జయంతి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ బొర్రా నటేష్, మాజీ కౌన్సిలర్ శీలం మారుతీరావు (బాబ్జి), సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు వేణుగోపాలుడి కల్యాణం



కోడూరు: మండలంలోని పాదాలవారి పాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారి కల్యాణాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ సుధాకర్ ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు చెప్పారు. వేణుగోపాలుడి మూలమూర్తికి ప్రత్యేక అలంకారం, కల్యాణ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ ఉంటుందని చెప్పారు.

శస్త్ర చికిత్సలకు 75 మంది ఎంపిక



నాగాయలంక: సుదర్శి మానవతా సేవాసంస్థ అందిస్తున్న నేత్ర సేవలు ఆదర్శనీయమని పలువురు అభినందించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆసుపత్రి (పెదకాకాని) సహకారంతో ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్ ఆర్థిక సౌజన్యంతో ఈ సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. స్థానిక మారుతీ విద్యానికేతన్ డిజిటల్ స్కూలు ప్రాంగణంలో జరిపిన శిబిరంలో 102 మందికి డాక్టర్ చిన్మయ, డాక్టర్ లిల్లీజాయ్ పరీక్షలు చేయగా వీరిలో 75 మంది వృద్ధులను ఐఓఎల్ ఆపరేషన్ (కంటి లోపల అద్దం అమరిక)లకు ఎంపిక చేశారు. ఉచిత శస్త్ర చికిత్సలకై బస్సులలో శంకర కంటి ఆసుపత్రికి పంపించారు. కనిగంటి వెంకట నారాయణ, ఆసుపత్రి క్యాంప్ ఇన్‌చార్జి నాగాబాబు, టి.రవిబాబు, మత్తి శివ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా మాధవస్వామి కల్యాణం



గూడూరు: గూడూరులో ప్రసిద్ధి చెందిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మాధవస్వామి కల్యాణోత్సవం ఆదివారం రాత్రి కన్నుల పండువగా సాగింది. ఈనెల 8న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు రంగురంగుల రంగవల్లులతో ఆకట్టుకున్నారు. సాయంత్రం అశ్వవాహనంపై ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. రాత్రి వేదపండితుల వేదమంత్రాల మధ్య స్వామి వారి దివ్య కల్యాణం ఘనంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్త పాడె మోసిన కిట్టు



వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్త పాడే మోస్తున్న కిట్టు

బుర్రపోతుపాలెం(మచిలీపట్నంరూరల్): గ్రామ పెద్ద వైఎస్సార్ సీపీ నాయకుడు గోపిశెట్టి వెంకటేశ్వరరావు పాడెను మచిలీపట్నం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) మోసి తన అభిమానాన్ని చాటుకున్నారు. మండల పరిధి బుర్రపోతుపాలెంకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత గోపిశెట్టి వెంకటేశ్వరరావు (85) వృద్ధాప్యంతో శనివారం మరణించగా ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా కిట్టు మాట్లాడుతూ వెంకటేశ్వరరావుకు దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అభిమానం అన్నారు. వెంకటేశ్వరరావు అకాల మరణం తీరంలోటని కిట్టు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో వైఎస్సార్ సీపీకి మొదటి ఓటు వేసే వ్యక్తిని కోల్పోవడం చాలా బాధాకరమైన విషయమన్నారు. వెంకటేశ్వరరావు మృతదేహానికి శ్రద్ధాంజలి ఘటించి పాడేమోసి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ నట్టే ప్రసాద్, నార్త్ మండలం కన్వీనర్ మట్టా మోహన్ నాంచారయ్య, గంగిశెట్టి సురేష్, పామర్తి శివమణి, వుల్లిపాలెం పవన్, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు వంతెన నిర్మాణానికి శంకుస్థాపన



లజ్జబండ మురుగుకాల్వపై వంతెన నిర్మాణ పనుల్లో యంత్రాలు

గూడూరు: గూడూరు– తుమ్మలపాలెం గ్రామాల మధ్య లజ్జబండ మురుగుకాల్వలపై వంతెన నిర్మాణానికి బందరు ఎంపీ, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద వంతెన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.3.2 కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుతం ఉన్న వంతెన 5 మీటర్ల వెడల్పుతో ఉండగా, కొత్తగా నిర్మిస్తున్న వంతెనను 7.5 మీటర్ల వెడల్పుతో డిజైన్ చేశారు. వర్షాలు పడితే కాల్వలో వంతెన నిర్మాణ పనులకు ఆటంకం కలిగే అవకాశం ఉండటంతో నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టరు ఇప్పటికే పనులు ప్రారంభించడం గమనార్హం.

ఆకులమన్నాడులో మైక్రో ఫిల్టర్ ప్రారంభోత్సవం..

ఆకులమన్నాడులో రూ.13 లక్షల సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన మైక్రో ఫిల్టర్‌ను కూడా ప్రారంభించనున్నారు. గ్రామంలోని రక్షిత నీటి పథకానికి అనుసంధానంగా ఏర్పాటు చేసిన మైక్రో ఫిల్టర్ ద్వారా రోజుకు 5 లక్షల లీటర్ల నీటిని శుద్ధి చేసి సరఫరా చేస్తుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గుర్రం నాగరాజు తెలిపారు.

పరీక్షల సమయంలో అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జ్ కార్యదర్శి నగేష్



గూడూరులో చేతి రాత ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థులు

మచిలీపట్నంటౌన్: విద్యార్థులు పలు పరీక్షల సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని జిల్లా గ్రంథాలయ సంస్థ ఇంచార్జ్ సెక్రటరీ ఎంవీడీటీ నగేష్ సూచించారు. స్థానిక పోర్ట్ రోడ్ లోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు పరీక్షలు రాసే సమయంలో సమయపాలన, ప్రశ్నలకు జవాబులు ఎలా రాయాలి, పరీక్ష రాసే ముందు జవాబు పత్రంపై ముఖ్య సమాచారం ఎలా పూరించాలో తదితర అంశాలను వివరించారు.

చేతి రాతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

గూడూరు: పరీక్షలలో చక్కని దస్తూరీ ఉంటేనే మంచి మార్కులు వస్తాయని గూడూరు శాఖా గ్రంథాలయ అధికారి వై.శ్రీనివాసరావు అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం గూడూరులోని శాఖా గ్రంథాలయంలో చిన్నారులకు చక్కని దస్తూరీపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడితే చక్కని దస్తూరీ ఉంటేనే మనం రాసే ప్రతి అక్షరం సులువుగా అర్థం అవుతుందన్నారు. చిన్న వయస్సు నుంచే చేతి రాతపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని ఆయన కోరారు.

వైభవంగా యల్లారమ్మ జాతర

నాగాయలంక: గ్రామంలోని సబ్బినేనిబజారులో కొలువైఉన్న సబ్బినేని వంశీయుల ఇలవేలుపు యల్లారమ్మ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. సబ్బినేని వంశీయులు, గ్రామస్తులు అమ్మవారికి తెల్లవారుజాము నుంచే పసుపు కుంకుమలు, చద్ది నైవేద్యాలు సమర్పణతో మొక్కుబడులు చెల్లించుకున్నారు. తొలుత సంప్రదాయక రీతిలో రజక పూజారులు యల్లారమ్మ ఎదుట ఘటానికి విశేష పూజలు జరిపి, రంగులతో అమ్మవారి ఆకారాన్ని ప్రతిబింబిస్తూ భారీ రంగవల్లి బొమ్మను ప్రదర్శించారు. శనివారం రాత్రి గ్రామోత్సవం ముగించుకుని ఆదివారం ఉదయమే ఘటం గుడికి చేరుకున్నాక జాతర సంప్రదాయాల ప్రకారం తొలుత ఆలయంలోని పోతురాజు శిలకు నైవేద్యంతో పూజలు చేశారు. జాతర పూజల తదుపరి రెండు వేల మందికి అన్నసంతర్పణ నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ సబ్బినేని భుజంగరావు, సురేష్‌బాబు, చౌదరి, వెంకటేశ్వరరావు, చందు, లక్ష్మణరావు, సబ్బినేని శ్రీనివాసరావు ఇతర సభ్యులు, పలువురు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

శోభాయమానంగా జగజ్జ్యోతి

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని శ్రీదేవి భూదేవి శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావన్నారాయణ స్వామి కల్యాణ మహోత్సవాలలో శనివారం రాత్రి జగజ్జ్యోతి కార్యక్రమం శోభాయమానంగా జరిగింది. అంతకు ముందు నిత్యార్చన, నిత్యహోమం, బలిహరణ పూజలు శాస్త్రోక్తంగా, సంప్రదాయబద్ధంగా జరిపారు. అలయ ప్రధాన అర్చకుడు పంచాగం రమణాచార్యులు, కందూరి శ్రీనివాసాచార్యులు హోమ కార్యక్రమాలు నిర్వహించారు. వంశ పారంపర్య ధర్మకర్త భోగాది విశ్వేశ్వరరావు, భోగాది వెంకట శేషగిరిరావు సతీ సమేతంగా పూజాధికములు జరిపారు. గ్రామ సర్పంచి మండలి ఉదయభాస్కర్, ఈఓ సీహెచ్. సుధాకర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. సోమవారం రథంగహోమం, రథోత్సవం, గ్రామబలిహరణ జరుగుతాయని ధర్మకర్త చెప్పారు.

ఘంటసాల కరణంకు సతీవియోగం



విజయలక్ష్మి

ఘంటసాల: ఘంటసాల కరణంగా ప్రజలందరికీ సుపరిచితులైన ఘంటసాల రాధాకృష్ణమూర్తి సతీమణి, చల్లపల్లి ఆర్‌ఐ ఘంటసాల కృష్ణమోహన్ మాతృమూర్తి ఘంటసాల విజయలక్ష్మి (84) ఆదివారం మృతి చెందారు. ఘంటసాల, చల్లపల్లి మండలాల పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు, అధికారులు ఘంటసాల గ్రామంలో విజయలక్ష్మి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

వైభవంగా లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు



శేషవాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ: స్థానిక లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం కనుల పండువగా ప్రారంభమయ్యాయి. వార్షిక బ్రహ్మోత్సవాలను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ అర్చకులు ఆలయంలో నిత్యహోమం, బలిహరణం, నృసింహ జయంతి కార్యక్రమాలను నిర్వహించారు.

ఊరేగిన స్వామివారు..

ఆలయ అనువంశిక ధర్మకర్త పోతరాజు భాస్కర రావు రూ.లక్ష వ్యయంతో స్వామివారికి సమర్పించిన నూతన శేషవాహనానికి ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన స్వామివారిని శేషవాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో సాగిన ఈ ఊరేగింపునకు భక్తులు ఎదురేగి భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తల స్వగృహంలో స్నాతకపు కావిడి, నిత్యహోమం, బలిహరణం, జగజ్యోతి ప్రజ్వలనం, ఎదురుకోలు ఉత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ – విజయలక్ష్మి దంపతులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు, ఆలయ ధర్మకర్త భాస్కరరావు తదితరులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

బుద్ధ జయంతి ఏర్పాట్ల పరిశీలన



ఘంటసాల: ఘంటసాలలో సోమవారం నిర్వహించే బుద్ధ జయంతి మహోత్సవ ఏర్పాట్లను ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ రేగుళ్ల మల్లికార్జునరావు, గొర్రెపాటి రామకృష్ణ అధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు. శయన బుద్ధ విహార్ ప్రాజెక్టు, బౌద్ధ స్థూపం వద్ద జరిగే సెమినార్లు, సభ ఏర్పాట్లు, బౌద్ధ స్థూపం, మ్యూజియం వద్ద సభా వేదిక ఏర్పాట్లను పరిశీలించారు. రాష్ట్ర మంత్రుల రాక నేపథ్యంలో ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఎంపీడీవో డి.సుబ్బారావు, ఉపాధి పథకం ఏపీవో రాజ్ కుమార్, శ్రీకాకుళం డీసీ చైర్మన్ అయినపూడి భాను ప్రకాష్, నేతలు, పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌కు సింహాద్రి పరామర్శ



నాగాయితిప్పలో సర్పంచ్ వెంకటేశ్వరరావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌బాబు

నాగాయితిప్ప(మోపిదేవి): వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, నాగాయితిప్ప గ్రామ సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరావును అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆదివారం వారి ఇంటి వద్ద పరామర్శించారు. ఇటీవల జరిగిన ఓ ఘటనలో వెంకటేశ్వరావుకు కాలు విరిగింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌బాబు వెంకటేశ్వరావును పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట నియోజకవర్గ యువ నాయకులు సింహాద్రి వికాస్‌బాబు, ఉత్తరచిరువోలులంక గ్రామ సర్పంచ్ చింతా శ్రీనివాసరావు, రెడ్రౌతు వెంకటరమణ, మత్తి వెంకటేశ్వరావు, బచ్చు దిలీప్, పండలనేని శివప్రసాద్, చోడాబత్తిన పూర్ణచంద్రరావు, బండారు సూరిబాబు తదితరులు ఉన్నారు.

ప్రతిభావంతులైన విద్యార్థులకు సత్కారం



సత్కారం పొందిన విద్యార్థులతో అతిథులు, తల్లిదండ్రులు



విద్యార్థులను సన్మానిస్తున్న ఆదివెలమ సంక్షేమ సంఘం నాయకులు

నాగాయలంక: స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి ఫలితాల్లో మండలంలో వివిధ పాఠశాలల్లో మొదటి స్థానం పొంది ప్రతిభావంతులుగా నిలిచిన ఐదుగురు విద్యార్థులను ఆదివారం ఘనంగా సత్కరించారు. సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ నేతృత్వంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, నాగాయలంక రెడ్‌క్రాస్ చైర్మన్ భోగాది శివవిష్ణువర్ధన్, సీనియర్ ఫొటోగ్రాఫర్ చన్నగిరి లతామోహన్ చేతుల మీదుగా విద్యార్థులను దుశ్శాలువాలతో సన్మానించి పండ్ల మొక్కలను అందజేశారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మొదటి స్థానం పొందిన విద్యార్థులు భోగాది గాయత్రి (తలగడదీవి), పూషడపు మనస్వి(భావదేవరపల్లి), యలవర్తి మహాలక్ష్మి(ఎదురుమొండి), వల్లభనేని బాలాజీ (ఏటిమొగ), చెరుకూరి సంజయ్(నాగాయలంక స్కాలర్స్), బావిరెడ్డి సుస్మిత (నాగాయలంక విద్యాభారతి) ఈ సత్కారం అందుకున్నారు. కనిగంటి నారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆది వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

మచిలీపట్నంటౌన్: ఆది వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక సంఘ కార్యాలయంలో ఆదివారం పలు పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను సంఘ నాయకులు సత్కరించి అభినందించారు. మచిలీపట్నం నగరంలో ఇంటర్, టెన్త్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రోత్సహించాలని ఉద్దేశంతో కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. విద్యార్థులను ఆశీర్వదిస్తూ వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిల్లారిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు సత్కరించారు. సంఘ నాయకులు మాదిరెడ్డి కృష్ణ ప్రసాద్, పిల్లారిశెట్టి సత్యనారాయణ, పిల్లల తల్లితండ్రులు హాజరై వారిని దీవించారు.

ఘనంగా ఆదిశంకరాచార్య జయంతి



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: నగరంలోని బుట్టాయిపేట దత్తాశ్రమం లో సద్గురు గణపతి సచ్చిదానంద స్వామీజీ, దత్త విజయానంద తీర్థ స్వామీజీ వారి దివ్య ఆశీస్సులతో ఆదివారం శ్రీ ఆది శంకరాచార్య జయంతి, సద్గురు శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి మాతృమూర్తి అయిన జయలక్ష్మి మాత జయంతి ఘనంగా నిర్వహించారు. శ్రీ అత్రి వరద దత్తాత్రేయ స్వామికి దత్త స్వామికి పంచామృతాల క్షీరా అభిషేకం నిర్వహించారు. తదనంతరం జయలక్ష్మి మాతకు మాతృమండలి ఆధ్వర్యంలో లక్ష మల్లెల పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. దత్తాత్రేయుని హోమాన్ని నిర్వహించి మధ్యాహ్నం పూర్ణాహుతి చేశారు. ఈ కార్యక్రమంలో విశేషంగా భక్తులు పాల్గొన్నారు. దత్త ఆశ్రమానికి విచ్చేసిన భక్తులందరికీ దత్త భిక్ష అన్నప్రసాదాన్ని అందజేశారు. కందప శివరామకష్ణ, మునుకుట్ల శ్రీనివాస్, కపవరపు నాగవెంకట వరప్రసాద్, తల్లురిశోభా రాణి, తమ్మన సుబ్బారావు, మల్లది బుద్దేశ్వరావు, చిన్నం గోవర్ధన, మాదిరెడ్డి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ విజయవంతం కోరుతూ పూజలు



జాతీయ జెండాలతో సైన్యానికి సంఘీభావం తెలుపుతున్న భక్తులు

బంటుమిల్లి: భారత్– పాకిస్థాన్ దేశాల మధ్య జరుగుతున్న ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని, భారత సైన్యానికి మనోధైర్యం, దేశ ప్రజలకు రక్షణకు భగవదనుగ్రహం కావాలని కోరుతూ ఆదివారం పార్టీలకతీతంగా పూజలు నిర్వహించారు. పాశ్చాపురం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ సువర్చలాంజనేయ స్వామి ఆలయంలో జరుగుతున్న హనుమాన్‌చాలీసా పారాయణ పతనంలో భాగంగా భక్తులు పారాయణ నిర్వహించారు. పండితులు రొంపిచర్ల హనుమంతాచార్యులు పర్యవేక్షణలో పారాయణ 36వ రోజుకు చేరుకుంది. భక్తులు పార్టీల కతీతంగా భారత్–పాక్‌ల మధ్య జరుగుతున్న యుద్ధాన్ని దృష్టిలో పెట్టుకుని చాలీసా పారాయణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.ఆంజనేయులు, జె.కిరణ్‌గుప్త, కే యేసురాజు, బి.ఆంజనేయులు, ఎం.వెంకటేశ్వరరావు, డి.శ్రీనివాసరావు పలు గ్రామాల భక్తులు పాల్గొన్నారు. అనంతరం జాతీయ జెండాలు చేతపట్టి భారత్‌మాతాకీ జై, జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేసి సైన్యానికి సంఘీభావం తెలిపారు.

ఆ పాత మధురం.. మళ్లీ కలుద్దాం



చల్లపల్లి ఎస్సార్‌వైఎస్పీ హైస్కూల్ 1995- 96 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

చల్లపల్లి: పదవ తరగతి 30 ఏళ్లకిందట పూర్తిచేసి వివిధ వృత్తుల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకుని ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ ఉత్సాహంగా.. ఉల్లాసంగా గడిపారు. స్థానిక ఎస్సార్ వైఎస్పీ హైస్కూల్లో 1995–96 పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి కార్యక్రమానికి విచ్చేశారు. పాత స్నేహితులను కలుసుకుని కుటుంబ సభ్యుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. నాడు తరగతి గదుల్లో చేసిన అల్లరి పనులను తలుచుకుని మురిసిపోయారు. కుటుంబ సభ్యులకు తరగతి గదులను, కూర్చున్న బెంచీలను చూపించి ఎంజాయ్ చేశారు. పూర్వ విద్యార్థులకు ఆహ్వానం పలికేలా లేత కొబ్బరి ఆకులతో ఏర్పాటు చేసిన స్వాగత మండపం ఆకర్షణగా నిలిచింది. జ్యోతి ప్రజ్వలనతో సభా కార్యక్రమాలను ప్రారంభించారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి వందనం సమర్పించారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. చల్లటి చెరకు రసం, కొబ్బరి బొండాలు, తాటి ముంజులు ఏర్పాటు చేసి నిర్వహక కమిటీ సభ్యులు అందరి ప్రశంసలు అందుకున్నారు. పూర్వ విద్యార్థుల పిల్లలు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మళ్లీ కలుద్దాం... అంటూ ఒకరికొకరు కరచాలనాలు చేసుకుంటూ వీడ్కోలు చెప్పుకున్నారు.